క్లుప్తంగా

విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ



విద్యార్థులకు ఉపకరణాలందించిన సూర్యకుమారి వరహాలు

రావికమతం: కవగుంట పాఠశాలకు చెందిన విద్యార్థులకు పది రకాల విద్యా ఉపకరణాలను సర్పంచ్ దాసరి సూర్యకుమారి వరహాలు ఆదివారం వితరణగా అందించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ దాసరి రామునాయుడు జ్ఞాపకార్థంగా ఆయన కోడలు, కుమారుడు సూర్యకుమారి, వరహాలు వీటిని అందించారు. అదేవిధంగా హేండ్ వాషింగ్ డే సందర్భంగా ప్రతి ఒక్కరూ భోజనానికి ముందు, మలవిసర్జన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలని ఈ సందర్భంగా అవగాహన కల్పించారు.

చేతుల శుభ్రతతో వ్యాధులు దూరం



చేతుల శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

మాకవరపాలెం: చేతుల శుభ్రతతో వ్యాధులను నివారించవచ్చని వైద్య సిబ్బంది ప్రజలకు సూచించారు. మాకవరపాలెంలో ఆదివారం పిల్లలు, పెద్దలకు చేతుల శుభ్రతపై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. వ్యక్తిగత శుభ్రతపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. నిత్యం తినే ముందు, తర్వాత తప్పనిసరిగా చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలన్నారు. దీనివల్ల వ్యాధులను నివారించవచ్చన్నారు. ఆశ కార్యకర్తలు లక్ష్మి, అచ్చియ్యమ్మ, వరలక్ష్మి పాల్గొన్నారు.

దసరా శిక్షణ తరగతులు ప్రారంభం



మాట్లాడుతున్న గ్రంథపాలకురాలు దమయంతి

నర్సీపట్నం: వేసవి శిక్షణ మాదిరిగానే నిర్వహిస్తున్న దసరా శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథపాలకురాలు పి.దమయంతి విద్యార్థులకు సూచించారు. స్థానిక గ్రంథాలయంలో ఆదివారం నుంచి దసరా శిక్షణ తరగతులను ప్రారంభించారు. శిక్షణ తరగతులకు విచ్చేసిన విద్యార్థులను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యమిస్తుందన్నారు. దీనిలో భాగంగానే గ్రంథాలయానికి వచ్చి చదువుకోవటం అలవాటు చేసుకోవాలన్నారు. అనుభవజ్ఞులైన ప్రభుత్వ ఉపాధ్యాయులతో ఆయా సబ్జెక్టుల్లో శిక్షణ ఇప్పిస్తామన్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

రోలుగుంట: కొంతలంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కె.ప్రభాకర్రావు తెలిపారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసే శిబిరంలో వివిధ విభాగాల వైద్య నిపుణులు పాల్గొని రోగులను పరీక్షించి అవసరమైన వారికి మందులు ఉచితంగా పంపిణీ చేస్తారన్నారు. ఖరీదైన వైద్య సేవలు గ్రామంలో ఉచితంగా అందనున్నాయని, ఈ అవకాశం గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఘనంగా ప్రపంచ విద్యార్థి దినోత్సవం



అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

రావికమతం: సీఆర్పీ రామారావు ఆధ్వర్యంలో టి.అర్జాపురం పాఠశాలలో ప్రపంచ విద్యార్థి దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా, భారత అణు పితామహుడు, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ జయంతిని అక్టోబర్ 15న కేంద్ర ప్రభుత్వం ప్రపంచ విద్యార్థి దినోత్సవంగా ప్రకటించింది. ఇందులో భాగంగా అబ్దుల్ కలామ్ చిత్రపటానికి నివాళులర్పించి విద్యార్థులు ఆయన సేవలను స్మరించుకున్నారు.



నర్సీపట్నం: కుటుంబ సభ్యులతో అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే గణేష్



నర్సీపట్నం: ఆలయానికి విచ్చేసిన భక్తులతో ఎమ్మెల్యే గణేష్ కుటుంబ సభ్యులు



రోలుగుంట: వీధుల్లో వాహనంపై అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు



మాకవరపాలెం: బూరుగుపాలెంలో పూజలు చేస్తున్న భక్తులు

మమ్మేలు.. దుర్గమ్మ తల్లీ

అమ్మా.. భవానీ.. లోకాలనేల.. దుర్గమ్మ తల్లీ.. అంటూ భక్తులు శక్తిస్వరూపిణిని కొలుస్తున్నారు. వాడవాడలా శరన్నవరాత్రోత్సవాలు ఆదివారం శోభాయమానంగా ప్రారంభమయ్యాయి. గ్రామగ్రామాన మండపాల్లో కొలువైన దుర్గాదేవి విగ్రహాలకు తెల్లవారుజాము నుంచే భక్తులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. వెరసి ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

- వాడవాడలా శరన్నవరాత్రోత్సవాలు ప్రారంభం
- గ్రామగ్రామాన దుర్గాదేవి ప్రతిమల ఏర్పాటు
- తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు
- భవానీమాలధారణ భక్తులతో ఆధ్యాత్మిక సందడి
- ఉత్సవాలను ప్రారంభించిన ఎమ్మెల్యే గణేష్



రావికమతం: కొత్తకోటలో సారె ఊరేగింపులో భక్తులు

నర్సీపట్నం: దేవదాయ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో దసరా ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా అమ్మవారి స్వర్ణకవచాలంకృత దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ ఉత్సవాలను ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ప్రారంభించారు. కుటుంబ సమేతంగా అమ్మవారి ఆలయానికి విచ్చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. తొలుత వీరికి ఆలయ కమిటీ చైర్మన్ చెరుకూరి సత్యనారాయణ, ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. కలశ స్థాపన పూజా కార్యక్రమాలు అనంతరం అమ్మవారి ఉత్సవ మూర్తిని ప్రత్యేక మండపంలో ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ నెల 25న దసరా ఉత్సవాలకు ప్రజలంతా విచ్చేసి విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఉత్సవాలకు విచ్చేసే భక్తులు ఎలాంటి అసౌకర్యం కలకుండా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆలయ కమిటీ వారికి సూచించారు. అనంతరం చైర్మన్ సత్యనారాయణ ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, మాజీ వైస్ చైర్మన్ గొలుసు నర్సింహమూర్తి, తమరాన అప్పలనాయుడు, పార్టీ అధ్యక్షుడు ఏకా శివ, కౌన్సిలర్లు వీరమాచినేని జగదీశ్వరి, వీసుల చైతన్య, అయ్యారక కార్పొరేషన్ చైర్మన్ కర్రి శ్రీనివాసరావు, కోఆప్షన్ సభ్యురాలు షేక్ రోజా, స్వామి, ఆలయ ఈవో గంగారావు, ఉత్సవాల స్పెషల్ ఆఫీసర్ టి.ఎస్.ఎస్.శర్మ పాల్గొన్నారు.

మాకవరపాలెం: మండలంలోని అన్ని గ్రామాల్లోనూ దుర్గాదేవి నవరాత్రోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. రామన్నపాలెం, తామరం, జంగాలపల్లి, గిడుతూరు, బూరుగుపాలెం, కోడూరు, తూటిపాల, మాకవరపాలెం, తదితర గ్రామాల్లో మండపాలను ఏర్పాటు చేసి దుర్గమ్మ ప్రతిమలను నిలిపారు. ఈ సందర్భంగా నిత్యం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. మాకవరపాలెం బీసీ కాలనీలో దుర్గామల్లేశ్వర ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజల్లో భక్తులు, భవానీమాలధారణ భక్తులు పాల్గొన్నారు.

నాతవరం: స్థానిక శ్రీశక్తి పంచాయతన ఆలయ సముహంలో ఆదివారం తెల్లవారు నుంచే పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. చుట్టు పక్కల గ్రామాలకు చెందిన పలువురు ఇక్కడ ఆలయంలో భవానీమాలలు ధరించారు. ఎ.శరభవరం పి.కె.గూడెం, వెన్నలపాలెం, ములగపూడి, సిద్ధిపట్నం, వల్సంపేట, తదితర గ్రామాల్లో దుర్గాదేవి ప్రతిమలు నిలిపి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పి.జగ్గంపేట, గుమ్మడిగొండ, వెదురుపల్లి గ్రామాల్లోని దుర్గాదేవి ఆలయాల్లో భక్తుల రద్దీ నెలకొంది.

మాడుగుల రూరల్: చీడికాడ మండలం అప్పలరాజుపురం దేవి మెట్టపై అతి పురాతన లలితాదేవి ఆలయంలో శరన్నవరాత్రోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఎంపీపీ కురచా జయమ్మా నారాయణమూర్తి, సర్పంచ్ చుక్కా అప్పలనాయుడు దంపతులు తొలి పూజ చేశారు. సర్పంచ్ దంపతులు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు.

చీడికాడలో...

చీడికాడ చావిడి వద్ద దుర్గమాత ప్రతిమను నిలిపారు. శాస్త్రోక్తంగా జరిగిన ఈ కార్యక్రమంలో భవానీమాల ధరించిన భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కె.కోటపాడు: చౌడువాడలో సతకం పట్టు వద్ద కనక దుర్గాదేవి ఆలయంలో అమ్మవారికి ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్ ప్రత్యేక పూజలు చేశారు. ఎ.కోడూరు, పాతవలస, గొందుపాలెం, డి.అగ్రహారం, గవరపాలెం, కె.జె.పురం, గొట్లాం గ్రామాల్లో దుర్గాదేవీ విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఆయా కార్యక్రమాల్లో భవానీమాలాధారులైన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: కె.జె.పురంలో దుర్గమ్మ విగ్రహాన్ని చెరకు కాటా నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి స్థానిక కళావేదిక మీద ఏర్పాటు చేశారు. అమ్మవారికి మళ్ల కన్నబాబు, చినరామారావు దంపతులు తొలి పూజ చేశారు. కన్నబాబు దంపతులు విరాళం అందించారు. ఇక్కడ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అష్టలక్ష్మి కుంకుమ పూజలు ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజుల పాటు ఈ పూజలు చేస్తామని ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు రాపేట రామకొండలరావు, తెలిపారు. ఎం. కోడూరు శివాలయంలో పార్వతీదేవికి కలశ స్థాపన చేసి, సహస్రనామాలతో కుంకుమ పూజలు నిర్వహించారు. ఎం. కోడూరు దుర్గాలమ్మ ఆలయంతోపాటు వంటర్లపాలెం తాచేరు నది ఒడ్డున కనకదుర్గమ్మ ఆలయంలో పూజలు చేశారు. వి.వి.అగ్రహారం, తదితర గ్రామాల్లో దుర్గమ్మా విగ్రహాలు ఏర్పాటు చేశారు.

బుచ్చెయ్యపేట: సీతయ్యపేట దుర్గామల్లేశ్వర్ల ఆలయంలో కలశ స్థాపన చేసి లక్ష్మీగణపతి పూజతో నవరాత్రి ఉత్సవాలను ప్రారంభించారు. వందలాది మంది భవానీభక్తులు నవరాత్రి దీక్షలు స్వీకరించారు. బుచ్చెయ్యపేట, వడ్డాది, రాజాం, దిబ్బిడి, లోపూడి, గున్నెంపూడి, తురకలపూడి, విజయరామరాజుపేట తదితర గ్రామాల్లో దుర్గాదేవి విగ్రహాలను మండపాల్లో ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. కరక, చింతపాక, గొర్లెపాలెం తదితర గ్రామాలకు చెందిన 50 మంది భవానీ భక్తులు కాలి నడకన విజయవాడ అమ్మవారి దర్శనానికి బయలుదేరి వెళ్లారు. దసరా రోజు అమ్మవారిని దర్శించుకుంటామని వారు తెలిపారు.

రావికమతం: రావికమతం, కొత్తకోట గ్రామాల్లో దుర్గాదేవి ఆలయ నిర్వాహకులు, విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు అమ్మవారికి సారె సమర్పించారు. అమ్మవారి విగ్రహంతోపాటు 158 పళ్లాల మిఠాయిలు, పండ్ల సారెతో మహిళలు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించారు. చినపాచిల, మేడివాడ, జెడ్.కొత్తపట్నం, మర్రివలస, తట్టబంద, తోటకూరపాలెం తదితర గ్రామాల్లో భక్తులు ఆటో యూనియన్ సభ్యులు, వడ్రంగి యూనియన్ సభ్యులు దేవీ విగ్రహాలను భారీ ఊరేగింపుగా తీసుకువచ్చి మండపాల్లో ఏర్పాటు చేశారు.

రోలుగుంట: నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో రోలుగుంటలో వాహనంపై దుర్గాదేవి ప్రతిమను ఊరేగించారు. దారి పొడవునా కలశాలతో అభిషేకించి అమ్మవారిని దర్శించుకున్నారు. భవానీ మాల ధారణ భక్తులు భక్తి గీతాలతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అనంతరం స్థానిక పాత రామ మందిరంలో అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.

చోడవరం: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చోడవరం స్వయంభూ గౌరీశ్వరస్వామి ఆలయంలో పార్వతీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ ప్రాంతంలో అమ్మగనన్న అమ్మగా కోర్కెలు తీర్చే తల్లిగా భాసిల్లుతున్న దుర్గాదేవి ఆలయంలో అమ్మవారికి లలిత సహస్రనామ, కుంకుమ పూజలు చేశారు. మొదటి రోజు బాలత్రిపుర సుందరీ దేవి అలంకరణలో దర్శన మిచ్చారు. అమ్మవారిని దర్శించుకోవడానికి పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో శరణుఘోషతో ఆ ప్రాంతమంతా మారుమోగింది.



మాడుగుల రూరల్: కె.జె.పురంలో దుర్గమ్మ ప్రతిమను ఊరేగిస్తున్న భక్తులు



మాడుగుల రూరల్: అప్పలరాజుపురం లలితాదేవి ఆలయంలో కుంకుమపూజలు చేస్తున్న భక్తులు



బుచ్చెయ్యపేట: విజయవాడకు కాలినడకన వెళ్తున్న బుచ్చెయ్యపేట మండల భవానీభక్తులు



గోవాడలో అమ్మవారి విగ్రహానికి పూజలు చేస్తున్న భక్తులు



చోడవరం : దుర్గాదేవి ఆలయంలో బాలత్రిపుర సుందరీదేవి అలంకరణలో అమ్మవారు

మాడుగుల కోటపై మూడోసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేద్దాం

- రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి సైనికుల్లా పనిచేయాలి
- టీడీపీ, పచ్చమీడియా దుష్ప్రచారాలను తిప్పి కొట్టాలి
- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దిశానిర్దేశం
- తారువలో పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో సమావేశం



తారువ సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు

దేవరాపల్లి: మాడుగుల కోటపై ముచ్చటగా మూడోసారి వైఎస్సార్‌సీపీ జెండాను ఎగుర వేసేందుకు రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా సైనికుల్లా పనిచేయాలని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పిలుపునిచ్చారు. పార్టీ మండల అధ్యక్షుడు బూరె బాబూరావు అధ్యక్షతన ఆదివారం తారువ ఓపెన్ ఆడిటోరియంలో ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లకు డిప్యూటీ సీఎం దిశానిర్దేశం చేశారు. దేశ చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా రాజకీయాలకు అతీతంగా, లంచాలకు తావులేకుండా అర్హతే ప్రామాణికంగా సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని క్షేత్రస్థాయిలో విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలన్నారు. ఇచ్చిన మాట ప్రకారం అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను అమలు చేసిన సీఎం జగన్‌ను మరోమారు ముఖ్యమంత్రిగా గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా టీడీపీకి దిమ్మ తిరిగి మైండ్ బ్లాక్ అయ్యేలా తీర్పు ఇచ్చేందుకు అక్కచెల్లెమ్మలు, అవ్వాతాతలు, యువత సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రతీ ఇంటి తలుపుతట్టి జగన్ ప్రభుత్వం హయాంలో చేసిన సంక్షేమ, అభివృద్ధితోపాటు గత టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీ దోపిడీ, పథకాలకు మామూళ్లు వసూళ్లను ప్రజలకు వివరించాలన్నారు. స్కిల్ స్కామ్‌లో అడ్డంగా దొరికి జైల్లో ఉన్న చంద్రబాబుకు సానుభూతి కోసం టీడీపీ, పచ్చ మీడియా చేస్తున్న దుష్ప్రచారాలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని సూచించారు. మాడుగుల నియోజకవర్గానికి అత్యంత ప్రాధాన్యం కల్పించిన సీఎం జగన్‌కు గతం కంటే భారీ మెజార్టీతో గెలిపించి కానుకగా అందిద్దామన్నారు. సీఎం సహకారంతో నియోజకవర్గంలో అభివృద్ధి, ప్రభుత్వ భవనాల నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలను పక్కాగా పాటించి రాష్ట్రంలోనే రోల్ మోడల్‌గా నిలిచామన్నారు. నియోజకవర్గ చరిత్రలో ఎన్నడూలేని విధంగా మైదాన గ్రామాలతోపాటు శివారు గిరిజన గ్రామాలకు సైతం రోడ్లు, మంచినీరు తదితర సదుపాయాలను కల్పించిన వైఎస్సార్‌సీపీకే మాత్రమే ఓటు అడిగే హక్కు ఉందన్నారు. మండలంలో కోట్లాది రూపాయలతో చేసిన అభివృద్ధి టీడీపీ, పచ్చమీడియాకు కనబడటం లేదని విమర్శించారు. తనను రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించి, ప్రస్తుతం డిప్యూటీ సీఎం హోదాలో నిలిపిన నియోజకవర్గ ప్రజలకు తాను జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. మాడుగులలో అభ్యర్థి కోసం టీడీపీ రోజుకొక పేరు ప్రచారం చేస్తూ వెతుక్కుంటున్నారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు, లోకేష్ వచ్చినా ఇక్కడ వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమన్నారు. తనపై ఎన్ని విమర్శలు చేసినా, అసత్య కథనాలు ప్రచురించినా పట్టించుకోనని, నీతి, నిజాయితీకి కట్టుబడి నిత్యం నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలు పరిష్కరిస్తున్నానన్నారు. ముందుగా మహానేత వైఎస్. రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ, నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు ఉరుకుటి అప్పారావు, జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు, ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, జెడ్పీటీసీ కర్రి సత్యం, మహిళా విభాగం అధ్యక్షురాలు రొంగలి నారాయణమ్మ, యువజన విభాగం అధ్యక్షుడు కర్రి సూరినాయుడు, జేసీఎస్ మండల కన్వీనర్ కె.వి.రమణ, ఉగ్రాకుల అప్పారావు, దితర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వార్డుల్లో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి

ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు



సర్పంచ్ కాంతమ్మతో కలసి సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీపీ శ్రీనివాసరావు

రోలుగుంట: కొవ్వూరులోని వార్డుల్లో డ్రైనేజీ సమస్య పరిష్కరిస్తానని ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు స్థానికులకు భరోసా ఇచ్చారు. ఆదివారం ఆయన సర్పంచ్ కాంతమ్మతో కలసి గ్రామ వీధుల్లో తిరిగారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దీనిలో భాగంగా నాల్గో వార్డులో మురుగు సమస్య అధికంగా ఉందని, దీని వల్ల ఇక్కడ దుర్వాసన రావడంతోపాటు దోమలు విజృంభించి రోగాల బారిన పడుతున్నామని వీధి వాసులు వాపోయారు. దీనిపై ఆయన స్పందిస్తూ తన నిధులు మంజూరు చేసి డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరచి సమస్య పరిష్కరిస్తానన్నారు.

ఘనంగా అబ్దుల్ కలాం జయంతి



కలాం విగ్రహానికి పూలమాల వేస్తున్న క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్, వరహాలనాయుడు

నర్సీపట్నం: వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇక్కడ అబ్దుల్ కలాం విగ్రహానికి వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఎస్.ప్రసాద్, అడిగర్ల వరహాలనాయుడు, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ కనకరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తమిళనాడు రాష్ట్రం రామేశ్వరంలో 1931 అక్టోబర్ 15న అబ్దుల్ కలాం జన్మించారన్నారు. ఆర్థికంగా వెనకబడిన కుటుంబం కావడంతో చిన్న వయసులోనే న్యూస్ పేపరు బాయ్‌గా పని చేసి, ఇస్రో శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా దేశానికి ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులు, యువత పయనించాలన్నారు. కార్యక్రమంలో రాఘవేంద్రరావు, ఉపాధ్యాయులు అల్లు అప్పారావు, ఆళ్ల వరప్రసాద్, ఎల్ఐసీ వెంకటేశ్వరరావు, బి.గౌరినాయుడు పాల్గొన్నారు.

నూతన డీసీసీ అధ్యక్షుడికి ఘన సన్మానం



డీసీసీ అధ్యక్షుడు బొడ్డు శ్రీనివాసరావును సన్మానిస్తున్న నియోజకవర్గ నాయకులు

మాడుగుల రూరల్: కాంగ్రెసు పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన బొడ్డు శ్రీనివాసరావును ఆదివారం చీడికాడలో ఆయన స్వగృహంలో నియోజకవర్గ నేతలు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు. డీసీసీ కార్యదర్శులు నక్కా జోగారావు, కూండ్రపు గోపి, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు చీకటి పరదేశి, మాడుగుల, కె. కోటపాడు బ్లాక్ కాంగ్రెసు అధ్యక్షులు పేరపు అప్పన్నదొర, రొంగలి నాయుడుబాబు, మాడుగుల, కె. కోటపాడు, చీడికాడ, మండలాల అధ్యక్షులు పడాల కొండలరావు, వడ్డాది కోటేశ్వరరావు, తమరాన చిన్నంనాయుడు, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బుడబండి రాజు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఏసు రాజు, మండల యూత్ అధ్యక్షుడు వేచలపు రవి, బండారు ఎరుకునాయుడు, ఉరుకూటి అప్పారావు, మురికితి ఈశ్వరరావు పాల్గొన్నారు.

శంఖరాపురంలో తాగునీటి సమస్య పరిష్కారం



బోరును ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ రాంబాబు

బుచ్చెయ్యపేట: శింగవరం శివారు శంఖరాపురంలో తాగునీటి సమస్యను పరిష్కరించారు. ఇటీవల శింగవరం, శంఖరాపురం గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. తమ ఇళ్లకు వచ్చిన ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీకి శంఖరాపురం గ్రామస్తులు మంచినీటి పథకం లేదని చేతి బోరు ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఆయన ఆదేశాలతో అధికారులు మంచినీటి బోరు ఏర్పాటు చేశారు. ఆదివారం జెడ్పీటీసీ దొండా రాంబాబు ప్రారంభించారు. సర్పంచ్‌లు, పెదిరెడ్ల మాణిక్యం, గోపిశెట్టి శ్రీను, నాయకులు ఎల్లపు గోవింద, గుడాల ఆనంద్, దొండా రాజా, యెనుముల వాసు, కోవెల ఈశ్వరరావు, మణికంఠ, గుద్దేటి శ్రీను, రేణం సోమునాయుడు, చంద్రరావు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులకు సత్కారం



అనురాధ, భాస్కరరావు, లలితానాయుడులను సత్కరిస్తున్న పార్టీ నాయకులు

దేవరాపల్లి: ఇటీవల వైఎస్సార్‌సీపీలో జిల్లా స్థాయి పదవులు పొందిన మండలానికి చెందిన నాయకులను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సమక్షంలో మండల పార్టీ ఘనంగా సత్కరించింది. ఆదివారం తారువలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ వరదపురెడ్డి లలితానాయుడులను శాలువాలతో ఘనంగా సత్కరించారు.

ఘనంగా పసలమ్మ పండగ

కె.కోటపాడు: చౌడువాడలో పసలమ్మ పండగను ఆదివారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. సతకం పట్టు వద్ద పూజా కార్యక్రమాలు అనంతరం వసంతోత్సవాన్ని నిర్వహించారు. రైతులు పశువులపైనా, పాకల్లోను, పొలాల్లోను పసుపునీళ్లు చల్లారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొని సందడి చేశారు.

కాలి నడకన విజయవాడకు భవానీ భక్తులు



మాకవరపాలెం: భవానీ భక్తులు కాలినడకన విజయవాడకు పయనమయ్యారు. మండలంలోని జి.కోడూరు, జి.వెంకటాపురం గ్రామాలకు చెందిన ఆరుగురు భవానీమాల ధరించిన భక్తులు ఆదివారం కాలినడకన విజయవాడకు బయలుదేరారు. ఏటా మాదిరిగానే ఈ ఏడాది బయలుదేరిన వీరికి తోటి భవానీలు, గ్రామస్తులు వీడ్కోలు పలికారు.